క్లుప్తంగా

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి సన్మానం



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నూతన మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, చార్టెడ్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి, సుంకరి క్రాంతికుమార్, రాచకొండ శ్రీనివాస్, కర్రి సూర్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, విశ్వనాథం, సురేష్ తదితరులు ఉన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ



చిరు వ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో పలువురు చిరు వ్యాపారులకు లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో శనివారం గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సుంకర క్రాంతికుమార్ మాట్లాడుతూ గరిడేపల్లిలో చెప్పులు కుట్టుతూ జీవనం సాగిస్తున్న చింతల చెరువు బాబు, పల్లీల బండి పెట్టుకున్న నిరుపేద ఎస్‌కె ఖాసీంబీలు ఎండలో ఉండడం వ్యాపారం చేస్తుండడం చూసి వారికి గొడుగులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, మాజీ రీజియన్ చైర్మన్ సుందరి నాగయ్య, క్లబ్ సభ్యులు గంట రంగారెడ్డి, చిత్రం విశ్వనాథ్, చిత్తలూరి సైదులు, ఎలక సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

నడిగూడెం : మండలంలోనివేణుగోపాలపురం, బృందావనపురం గ్రామాల్లో శనివారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి రజిని మాట్లాడుతూ వ్యవసాయంలో రోజురోజుకూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరుతుండడంతో భూసారం తగ్గి ఛీడ, పీడల సమస్య తీవ్రం అవుతుందన్నారు. పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయన్నారు. కావున రైతులు తమ కుటుంబసభ్యుల ఆరోగ్యం కోసం అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. అనంతరం భూసారం పెరిగేందుకు సహజ సిద్ధ ఎరువులు, ఛీడ, పీడల నివారణకు వివిధ రకాల కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సిరెడ్డి, లింగయ్య, సీతారాములు, శ్రీను, అంతయ్య, అంజి, మధు పాల్గొన్నారు.

పరిమితికి మించి కూలీలను తరలిస్తే చర్యలు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య

పాలకవీడు : ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్‌ఐ. లక్ష్మీనర్సయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం పరిధిలో ఆటో డ్రైవర్‌లకు, కూలీలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణాల్లో ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవితాలు తలకిందులైతాయని అన్నారు. పరిమితికి మించి జనాలను ఎక్కించుకుంటున్న వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జయ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

కోదాడ : చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కోదాడలోని జయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం చిలువేరు వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కె.హరిచరణ్ 5వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి సీహెచ్.అక్షయ్ 3వ ర్యాంక్, 7వ తరగతి విద్యార్థిని నౌహియ ఫిరదౌసి 9వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మంచం పట్టిన గణపవరం

- గ్రామంలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- కాళ్లు, ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులు
- వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని జ్వర పీడితుల వేడుకోలు



ఇంట్లోనే చికిత్స పొందుతున్న మహిళ

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో దాదాపుగా ఎనభైశాతం ప్రజలు జ్వరాన భారిన పడ్డారు. వర్షాకాలం సీజనల్‌లో వ్యాధులు రావడం సహజం కానీ వేసవికాలం సమీపిస్తున్న ఈ సమయంలో గ్రామంలో జ్వరాలు ఎందుకు వస్తున్నాయో తెలియక బాధితులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఏ ఇంట్లో చూసిన ఇద్దరు, ముగ్గురు చొప్పున బాధితులు ఉన్నారు. గ్రామంలో గల ఆర్‌ఎంపీల వద్ద చికిత్స తీసుకుంటుండగా మరికొందరు స్థానికంగా జ్వరం తగ్గక పోవడంతో కోదాడ వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులు

జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్న బాధితులు కొందరు కోదాడ, మరి కొంతమంది ఖమ్మం వైద్యశాలలకు వెళ్తున్నారు. రక్త పరీక్షల్లో ఒక్కరిద్దరికి రక్తకణాలు పడిపోవడం, కొందరికి చికెన్ గున్యా వంటి లక్షణాలు వస్తున్నాయి తప్పితే మిగిలిన వారి రిపోర్టులన్నీ నార్మల్‌గానే ఉంటున్నాయని వారు చెబుతున్నారు. వైద్య పరీక్షలు చేసినా జ్వరం రావడానికి గల కారణం తెలియడం లేదని అంటున్నారు. జ్వరం వచ్చి కాళ్లు, ఒళ్లు నొప్పులు ఉంటుండడంతో మంచంపై నుంచి కదలలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. సహాయకులు ఉంటే తప్పా బాత్‌రూంకు కూడా వెళ్లలేనంత నొప్పులు ఉంటున్నాయని అంటున్నారు. వారం పదిరోజుల తర్వాత జ్వరం తగ్గినా నొప్పులు మాత్రం నెలవరకు ఉంటున్నాయని తెలిపారు. అయినా ప్రభుత్వ వైద్య సిబ్బంది గ్రామంలో నేటికీ కనీసం మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి



"మా గ్రామంలో అనేక మంది ప్రజలు ఒళ్లు నొప్పులు, జ్వరంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజులు వరకు కూడా నొప్పులు తగ్గడం లేదు. ఇంటికి ఒకరు చొప్పున జ్వర బాధితులు ఉన్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి.

– ఇర్ల సీతారాంరెడ్డి, గణపవరం

అంగన్‌వాడీల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్తా



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీల సమస్యలు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. హుజూర్‌నగర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం నాయకులు శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘంలో చేరిన వారందరికా ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం నాయకులు వి.నిర్మల, కె.వసుంధర, పాపమ్మ, సుమతి, వి.రమణ, బి.చంద్రకళ, ఎం.పద్మ, ఎం.బుజ్జీ, కవిత, కె.జయలక్ష్మి, స్వరూప, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ జగదీశ్వరరెడ్డికి సన్మానం



ఆర్డీఓ జగదీశ్వరరెడ్డిని సన్మానించిన తహసీల్దార్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి మెదక్ జిల్లా నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు ఆర్డీఓను శాలువాలతో సన్మానించారు. తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దంపతులిద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

- భార్యకు నాలుగు కొలువులు



రవి- తేజస్వి దంపతులు

నడిగూడెం : ఇటీవల గురుకుల నియామక బోర్డు ప్రకటించిన ఫలితాల్లో నడిగూడెం మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన దంపతులు కందిమల్ల రవి, తేజస్వినీ ఉద్యోగాలు సాధించారు. రవి టీజీపీ (సోషల్) ఉద్యోగం సాధించాడు. తేజస్వినీ ఏకంగా ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించింది. ఆమె జేఎల్ (బోటనీ), పీజీటీ, టీజీటీ (బయోలజీ), టీజీటీ (సైన్స్) ఉద్యోగాలకు ఎంపిక అయింది. దీంతో శనివారం ఆ దంపతులను గ్రామస్తులు అభినందించారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చిలుకూరువాసి



ఆదినారాయణ

చిలుకూరు : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గురుకుల ఉద్యోగ నియామక ఫలితాల్లో చిలుకూరు గ్రామానికి చెందిన గండు ఆదినారాయణ మూడు ఉద్యోగాలు సాధించారు. పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్‌లుగా ఎంపికయ్యారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగంలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : పట్టణంలోని అంజలి స్కూల్, రామాపురం రోడ్డులోని అంజయ్య మిల్ వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంజలి స్కూల్ రోడ్డు, రామాపురం రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీరో బిల్లు రాకుంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ (జీరో బిల్లు) రాని వారు ఆందోళన చెందొద్దని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ సమాచార ఫ్లెక్సీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ జీరో బిల్లు రాని వారు ప్రజాపాలన దరఖాస్తు పత్రంతో పాటు విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు జీరాక్స్‌ను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, ప్రసాద్, ఫణి కుమార్ తదితరులు ఉన్నారు.

బీసీ బిల్లు ప్రవేశ పెట్టేవరకు ఉద్యమం ఆగదు

నేరేడుచర్ల : పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టేవరకు ఉద్యమం ఆగదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని అనేక దశాబ్దాలుగా ఉద్యమం చేపడుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రావుల సత్యం, చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మునగాల : మోతె మండల కేంద్రం శివారులో సూర్యాపేట- ఖమ్మం జాతీయ రహదారిపై గత నెల 28న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజయరాఘవపురం, రేపాల గ్రామాలకు చెందిన ఆరుగురు నిరుపేద కూలీలు మృతిచెందారని వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. శనివారం మునగాలలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మృతిచెందిన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయాలపాలైన వారికి మెరుగైన వైద్యం అందించి రూ.పదిలక్షల ఆర్థికసాయం చెల్లించాలని వారు కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోకుండా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలని కోరారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



శ్రీపాదరావు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సాయాగౌడ్, తదితరులు

కోదాడరూరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను కోదాడలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయాగౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర స్పీకర్‌గా ఆయన చేసిన ప్రజాసేవను వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చల్లా శ్రీనివాసరావు, సంధ్యారాణి, సీనియర్ అసిస్టెంట్ మోసిన్‌బాబా, పుష్పలత, ఆర్‌ఐలు రాజేష్, సుజిత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో శనివారం పరీక్షకు 467 విద్యార్థులకు గాను 18 మంది గైర్హాజరు కాగా 449 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 211 మంది విద్యార్థులకు 10 మంది గైర్హాజరు కాగా 201 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రియదర్శినీ కళాశాలలో 256 మంది విద్యార్థులకు 8 మంది గైర్హాజరు కాగా 248 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన రణపంగు భిక్షం (60) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. భిక్షం దహన సంస్కారాల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చామకూరి మధు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన మేరిగ రామయ్య, కాసారపు సతీష్, దీనయ్య, ప్రశాంత్, గ్రామపెద్దలు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేస్తున్న ఎస్‌ఐ

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి మఠంపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తవనం శ్రీనివాసరెడ్డి అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేశాడని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బేతవోలులో ముగిసిన కనకదుర్గమ్మ జారత



ఎద్దుల పందేల్లో పాల్గొన్న గిత్తలు



జాతరలో కోలాటం వేస్తున్న కళాకారులు



జాతరలో పోలీస్ సిబ్బందికి కూల్ డ్రింక్స్ అందజేస్తున్న ఎస్‌ఐ రాంబాబు

- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు
- ప్రభబండ్లను ప్రదర్శనగా ఇళ్లకు తీసుకెళ్లిన గ్రామస్తులు
- కొనసాగుతున్న ఎద్దుల పందేలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ) శనివారంతో ముగిసింది. వేలాదిమంది భక్తులు తరలివచ్చి కనకదుర్గదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా పార్టీల ఆధ్వర్యంలో ప్రభబండ్లను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి శుక్రవారం అక్కడే ఉంచారు. శనివారం ఆ ప్రభబండ్లను కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా తమ ఇళ్లకు తీసుకెళ్లారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

రెండో రోజు శనివారం వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎద్దుల పందేలు రెండో రోజు ముమ్మరంగా జరిగాయి. జాతరకు బేతవోలు గ్రామంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలు, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట, ఖమ్మం జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో బేతవోలు కోలాహలంగా మారింది. వీధుల్లో జనం కిటకిటలాడారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న సహకార బ్యాంకు మేనేజర్ కృష్ణ

నేరేడుచర్ల : నగదు రహిత లావాదేవీలపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని నేరేడుచర్ల సహకార బ్యాంకు మేనేజర్ కృష్ణ అన్నారు. శనివారం స్థానిక సహకార బ్యాంకులో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు నగదు రహిత లావాదేవీలతో పాటు డిపాజిట్లు, రుణ సదుపాయలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ సహకార బ్యాంకు అధికారులు సతీష్, క్రాంతి, పీఏసీఎస్ డైరెక్టర్ దేవులపల్లి శంకరాచారి, సీఈఓ శ్రీనివాస్, రైతులు రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీను, సోమయ్య, వెంకట్రావ్, నర్మద, జ్యోతి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి




నడిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

నడిగూడెం : మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి హరినాథ్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

మోతె : పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల వరకు పోలియో చుక్కలు వేయించాలని మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగరాజు అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి పల్స్ పోలియో చుక్కల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి మార్చి 5వ తేదీ వరకు జరిగే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సీత, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు



మఠంపల్లి : ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్



చిలుకూరు : మండల పరిషత్ కార్యాలయంలో..



నడిగూడెంలో..

గరిడేపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వనజ కోరారు. శనివారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పుల కోసం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా నజీమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ కుమార్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో తెల్లరేషన్ కార్డు ఉండి కూడా జీరో కరెంటు బిల్లు, సబ్సిడీ గ్యాస్ పథకాలు వర్తించని వారు మండల పరిషత్ కార్యాలయంలో సవరణ చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మోతెలో..

మోతె : మండల కేంద్రంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి హరిసింగ్‌నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ వెంకటాచారి తదితరులు ఉన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాబు మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులపై వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహిం, సూపరింటిండెంట్ ప్రతాప్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, టైపిస్టు పద్మజా, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు సమస్యలు పరిష్కరించాలని జడ్జికి వినతి



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న గాలి శ్రీనివాసనాయుడు

కోదాడరూరల్ : కోదాడ కోర్టులో సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసనాయుడు జిల్లా జడ్జి రాజగోపాల్‌ను జిల్లా జడ్జి ఛాంబర్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. కోర్టులో పలు పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వరిలో కలుపు నివారించడమే లక్ష్యం



చిలుకూరులో వరి పొలాలను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

చిలుకూరు : వరి సాగులో కలుపు నివారించడమే తమ లక్ష్యమని సుమిటోమో కెమికల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ జపాన్ ప్రతినిధి అసామీసాగా అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని జానకీనగర్ గ్రామంలో పలువురి రైతుల పొలాలలో కంపెనీ నూతన కలుపు మందు పని తీరును వారు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు విద్యాసాగర్, రామ్‌మోహన్‌రెడ్డి, నందన్, రైతులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పారబోత

- దుర్వాసనతో ఇబ్బందులు



కలకోవకు వెళ్లే రహదారిలో వ్యర్థాలు

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్‌సెంటర్‌తో పాటు గ్రామంలో పలు గల చికెన్ దుకాణాల నిర్వాహకులు మండల కేంద్రం నుంచి కలకోవకు వెళ్లే రహదారి వెంట ఇష్టారాజ్యంగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. అలాగే పలువురు ఇళ్లలో జరిగే ఫంక్షన్లలో మిగిలిన వ్యర్థాలు కూడా రహదారి వెంట పడవేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో రహదారిపై వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.